

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 17 జనవరి 2025





అభివృద్ధికి నోచుకోని పలాస రైల్వేస్టేషన్

ఏడాదవుతున్నా అంతే!



నత్తనడకన సాగుతున్న ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ పనులు

- నత్తనడకన ఇచ్ఛాపురం, పలాస రైల్వేస్టేషన్ల అభివృద్ధి
- పది శాతం కూడా జరగని 'అమృత్ భారత్' పనులు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

అమృత్ భారత్ పథకం కింద ఆ రైల్వేస్టేషన్లను ఎంపిక చేయడంతో ప్రయాణికులు ఎంతో ఆనందపడ్డారు. సౌకర్యాలు మెరుగుపడతాయని, ప్రధాన రైళ్లకు హాల్ట్‌లు కల్పిస్తారని, స్టేషన్ల స్వరూపం మారిపోతుందని ఆశపడ్డారు. ఈ పనులకు గత ఏడాది ఫిబ్రవరి 26న వర్చువల్ విధానంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేశారు. కానీ.. ఏడాదవుతున్నా అభివృద్ధి పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటివరకు పది శాతం కూడా పనులు జరగలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదీ ఇచ్ఛాపురం, పలాస రైల్వే స్టేషన్లలో అమృత్ భారత్ పథకం కింద చేపడుతున్న పనుల తీరు.

పలాస/ఇచ్ఛాపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలాస, ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్లలో అభివృద్ధి పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఈ రెండు స్టేషన్లను 'అమృత్ భారత్' పథకం కింద ఎంపిక చేసినా.. ఆశించినస్థాయిలో అభివృద్ధి లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వేకు అధిక ఆదాయం వస్తున్న స్టేషన్లలో పలాస రైల్వే స్టేషన్ ఒకటి. ప్రతిరోజూ ఈ స్టేషన్ నుంచి ఏడువేల మందికిపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే, రైల్వే అధికారుల ఉదాసీనత కారణంగా ఈ స్టేషన్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. అమృత్ భారత్ పథకంలో భాగంగా పలాస రైల్వే స్టేషన్ అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం రూ.24.50 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులకు గతేడాది 26న ప్రధానమంత్రి మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. కాగా.. ఇప్పటివరకూ పది శాతం పనులు కూడా జరగలేదు. టిక్కెట్ కార్యాలయానికి అనుసంధానంగా ఒక ప్లాట్‌ఫారం నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం ఆ ప్రతిపాదనే లేకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రయాణికులు తమ వాహనాలు నిలుపుకొనేందుకు పార్కింగ్ స్థలాలు లేవు. దీంతో నో పార్కింగ్ జోన్‌లో వాహనాలు పెట్టుకొని ఇబ్బందులు పడాల్సి వస్తోంది. 2018లో తితలీ తుఫాన్ దెబ్బకు ఈ రైల్వేస్టేషన్ ధ్వంస మైంది. దీంతో రూ.5కోట్లతో రైల్వేస్టేషన్ మేనేజర్ గది, ప్రయాణికులు వేచిఉండే గది, అధికారుల కార్యాలయాలను నిర్మించారు. ఆ తరువాత ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదు. మొత్తం నాలుగు ఫ్లాట్‌ఫారాలు ఉండే పలాస రైల్వే స్టేషన్‌లో ఒక్క దానికి కూడా మరుగుదొడ్లు లేవు. గతంలో ఉన్న మరుదొడ్లను అభివృద్ధి పేరిట తొలగించారు. ఇంతవరకు వాటిని తిరిగి నిర్మించలేదు. ప్రతి రోజూ 7వేలకు పైగా ప్రయాణికులు రాకపోకలు సాగించే స్టేషన్‌లో మరుగుదొడ్లు లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కల్పించుకొని పలాస స్టేషన్ అభివృద్ధిపై రైల్వేశాఖ అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎక్కడి వేసిన గొంగళి అక్కడే..

ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో పలు సమస్యలు దర్శనమిస్తున్నాయి. ఒకపక్క మెరుగైన సౌకర్యాలు లేక.. మరోపక్క ప్రధాన రైళ్లు ఆగక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.17.98 కోట్లు మంజూరు చేసింది రైల్వేశాఖ. ఇందుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తికావడంతో (మిగతా 8వ పేజీలో..)

పనుల తీరు బాధాకరం..



అమృత్ భారత్ పథకం కింద ఇచ్ఛాపురం స్టేషన్‌ను ఎంపిక చేసినందుకు చాలా సంతోషించాం. కానీ, పనుల తీరు చూస్తుంటే బాధేస్తోంది. ఏడాదిలో కనీసం ఒక నిర్మాణాన్ని కూడా పూర్తిచేయలేకపోయారు. పనులు పూర్తయితే కానీ కొత్త రైళ్ల నిలుపుదల జరగదు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించాలి.

-కె.యోగేశ్వరరావు, ఇచ్ఛాపురం

రైళ్లకు హాల్టులు ఇవ్వాలి



ఇచ్ఛాపురం స్టేషన్‌లో ప్రధాన రైళ్లను నిలుపుదల చేయడం లేదు. పూరి-అహ్మదాబాద్, హౌరా-యశ్వంత్‌పూర్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని దశాబ్దాలుగా కోరుతున్నా రైల్వే ఉన్నతాధికారులు స్పందించడం లేదు. వాటితో పాటు ప్రధాన రైళ్లు నిలిపితే వేలాది మందికి ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఈ విషయంలో రైల్వే శాఖ స్పందించి చర్యలు తీసుకోవాలి.

-కట్టా సూర్యప్రకాష్, డీఆర్‌యూసీసీ మెంబర్ ఖుర్దా డివిజన్, ఇచ్ఛాపురం

కూరగాయల సరఫరాపై

కలెక్టర్ ఆరా

- అక్రమార్కులపై చర్యలు తప్పవని హెచ్చరిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శ్రీకాకుళం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 25 కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలకు, 13 మోడల్ స్కూల్స్‌కు కూరగాయల సరఫరాపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆరాతీశారు. కిలో రూపాయికే ఒక్కో కూరగాయలను సరఫరా చేసేందుకు ఓ వ్యక్తి టెండర్ వేశారు. అది సాధ్యమా.. అసాధ్యమా అన్నది పరిశీలించ కుండా ఉన్నతాధికారులు టెండర్ ఖరారు చేసేశారు. 'సమగ్ర శిక్ష' జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ బాగోతంపై 'ఆంధ్రజ్యోతి'లో గురువారం 'కిలో రూపాయికే' శీర్షికతో ప్రచురించిన కథనం జిల్లా అంతటా చర్చనీయాంశమైంది. రైతు బజార్‌లలోనూ.. బహిరంగ మార్కెట్‌లోనూ రూ.50కు కూడా లభించని కూరగాయలను ప్రభుత్వ పాఠశాలలకు కిలో రూపాయికి ఎలా సరఫరా చేస్తారని సాధారణ ప్రజలు సైతం చర్చించుకున్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ టెండర్ ప్రక్రియను.. ఇతరత్రా విషయాలను క్షుణ్ణంగా ఆరా తీశారు. దీనిపై ఫిర్యాదు అందితే బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. విద్యార్థులకు సరుకుల సరఫరా విషయంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

బెండికొండ ఆక్రమణపై సర్వే

- డీ పట్టా భూముల వ్యవహారంపై అధికారుల ఆరా

వజ్రపుకొత్తూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలం బెండికొండ ఆక్రమణపై అధికారులు ఆరా తీస్తున్నారు. జాతీయ రహదారి సమీపాన.. పలాస- కాశీబుగ్గ మార్కెట్‌కు కూతవేటు దూరంలో ఉన్న బెండి కొండపై వందలాది ఎకరాల భూమిని వైసీపీ నేతలు, ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించేశారు. దీనిపై ఈ నెల 14న 'బెండికొండ మాది!' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు. మండల సర్వేయర్ కె.తిరుపతిరావు ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో బెండికొండపై పలు ప్రదేశాల్లో అధికారులు సర్వే చేశారు. ఇప్పటికే కంచెలు వేసిన వారిని గుర్తించి.. వారి వద్ద ఉన్న భూమి హక్కుపత్రాలపై ఆరా తీశారు. భూమి హక్కు పత్రాలను డిప్యూటీ తహసీల్దార్ బి.మురళీకృష్ణ పరిశీలించారు. బెండికొండపై ఉన్న ప్రభుత్వ, రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో కొంతమందికి డీ పట్టా భూములను గతంలో రెవెన్యూ అధికారులు అందజేసినట్టు సర్వే అధికారులు గుర్తించారు. కాగా.. డీ-పట్టా భూములు ఏ ప్రాతిపదికన అందించారనే విషయమై ఆరా తీశారు. ప్రభుత్వ భూముల్లో డీ-పట్టా మంజూరు చేయాలంటే నిబంధనలు పాటించాలి. భూమిలేని నిరుపేదలు, విశ్రాంతి సైనికులకు ప్రత్యేక ఆదేశాలతో డీ-పట్టా భూములు ఇవ్వాలి. కానీ చాలావరకు నిబంధనలు పాటించకుండా డీ-పట్టాలను కొంతమంది కలిగి ఉండడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. డీ-పట్టాలు ఉన్న వారిలో చాలామందికి జిరాయితీ భూములు ఉన్నాయని చెబుతున్నారు. నిరుపేదలు కానప్పటికీ చాలా మందికి డీ-పట్టాలు ఎలా అందజేశారనే విషయమై అధికారులు విచారణ చేపడితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయని అభిప్రాయ పడుతున్నారు. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్ బి.మురళీ కృష్ణ మాట్లాడుతూ.. తహసీల్దార్ సీతారామయ్య ఆదేశాల మేరకు బెండికొండపై భూమి హక్కు పత్రాలను పరిశీలించామన్నారు. నివేదికను జిల్లా అధికారులకు పంపించనున్నట్టు తెలిపారు.



బెండికొండ వద్ద సర్వే చేస్తున్న అధికారులు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

త్వరగా చార్జిషీటు దాఖలు చేయాలి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి జేఏ మౌలానా

గుజరాతీపేట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): జైలులో ఖైదీలకు త్వరగా చార్జిషీటు దాఖలు చేసి న్యాయం చేకూర్చడానికి పోలీసులు సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. గురువారం శ్రీకాకుళంలోని జిల్లా కోర్టు ఆవరణలో అధికారులు, న్యాయవాదులతో సమావేశమయ్యారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి మాట్లాడుతూ ఖైదీల కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు అండర్ ట్రైల్ రివ్యూ కమిటీ(యూటీఆర్‌సీ) పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2023-24కు సంబంధించి వార్షిక ఆదాయాలు, ఖర్చుల గూర్చి వివరించారు. సమావేశంలో ప్రిన్సిపల్ సివిల్ న్యాయాధికారి కె.వి.ఎల్.హిమబిందు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, పోలీసు అధికారులు, ఉన్నతాధికారులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

వైద్యారోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీకి అధికారులు చర్యలు చేపడుతున్నారు. పీహెచ్‌సీల్లో ఏడాది పాటు పనిచేసేందుకు తాత్కాలిక పద్ధతిలో నియామకానికిగానూ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఎంహెచ్‌వో మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టు -1, ఎఫ్.ఎన్.ఓ - 5 పోస్టులు భర్తీ చేయనున్నట్టు వెల్లడించారు. అలాగే తాత్కాలిక పద్ధతిలో ఎన్.ఆర్.హెచ్.ఎం. ప్రోగ్రాంలో పని చేసేందుకు ఫిజీషియన్- 1, మెడికల్ ఆఫీసర్- 2, క్లినికల్ సైకాలజిస్టు- 1, ఆప్టోమెట్రిస్ట్ - 1, డెంటల్ టెక్నీషియన్- 1 పోస్టుల భర్తీ చేయనున్నట్టు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 22లోగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

పడవ బోల్తా

- మత్స్యకారుడి మృతి
- బందరువానిపేటలో విషాదం

8 లో

11 నెలలుగా జీతాల్లేవ్!

- ఆదిత్యాలయ దినసరి ఉద్యోగులకు ఆర్థిక కష్టాలు

7 లో



హలహళేశ్వరస్వామి జాతరలో భక్తుల రద్దీ

జన 'జాతర'

నరసన్నపేట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రెడ్డికపేట గ్రామంలోని హలహళేశ్వరస్వామి ఆలయం, కంబకాయలో స్వయంభీమేశ్వర ఆలయాల్లో గురువారం నిర్వహించిన జాతర్లకు జనం పోటెత్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. చెన్నాపురంలో జరిగిన జాతరకు జనం పోటెత్తారు. రెడ్డికపేట- బసివలస రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

సరిహద్దులో పేకాట.. అంతా టోకెన్లతోనే..

- ఆడాలంటే ఫీజు రూ.1,500 కట్టాల్సిందే
- ఆంధ్రా-ఒడిశా చివరి గ్రామాల్లో శిబిరాలు
- ప్రైవేట్ సిబ్బందితో రెండంచెల భద్రత
- ఒడిశా పోలీసులు పట్టుకోరు.. మన పోలీసులూ వెళ్లలేరు!

మెళియాపుట్టి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వేళ ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని తోటల్లో పేకాట శిబిరాలు జోరుగా సాగుతున్నాయి. సరిహద్దు గ్రామాలైన గారబంద, గోసాని, ఏడోమైలు, గొప్పిలి-పట్టుపురం, లావణ్యకోట తదితర గ్రామాల్లో ఎత్తయిన కొండలు, తోటలు ఉన్నాయి. వీటిని పేకాటరాయుళ్లు తమ స్థావరాలుగా మార్చుకున్నారు. రోజుకొక స్థావరంలో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. దీనికోసం ప్రైవేటు వ్యక్తులతో రెండంచెల భద్రత ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. పేకాట శిబిరానికి వచ్చే వారి వాహనాలను రెండు కిలోమీటర్ల దూరంలోనే వీరు అడ్డుకుంటారు. అక్కడ నుంచి తమ వాహనాల్లో మాత్రమే పేకాటరాయుళ్లను శిబిరానికి తీసుకొని వెళ్తారు. టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం, మందస, పాతపట్నం, కోటబొమ్మాళి, నందిగాం, కొత్తూరు, కంచిలి, కవిటి మండలాలతోపాటు జిల్లా కేంద్రం శ్రీకాకుళం నుంచి అధికంగా పేకాటరాయుళ్లు వస్తున్నట్లు సమాచారం. ఈ శిబిరాల విషయం ఒడిశా పోలీసులకు తెలిసినా దాడులు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. మన పోలీసులకు తెలిసినా అక్కడకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

పట్టించుకోని గత ప్రభుత్వం

ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో పేకాట శిబిరాలు జరుగుతున్నా గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. గతంలో ప్రతి నెల ఒడిశా, ఆంధ్రా పోలీసులకు పేకాట నిర్వాహకులు మామూళ్లు (మిగతా 8వ పేజీలో..)



పేకాట శిబిరాలు నిర్వహించే గారబంద సమీపంలోని కొండ ప్రాంతం

టోకెన్ తీసుకుంటేనే ఎంట్రీ..

పేకాట శిబిరాలను ఒడిశాకు చెందిన కొంతమంది వ్యక్తులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. పోలీసులు దాడి చేస్తే వారికి నగదు పట్టుబడకుండా నిర్వాహకులు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనికోసం టోకెన్ల ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నారు. పేకాటకు వచ్చేవారు రూ.1500 చెల్లించి ఎంట్రీ టోకెన్ తీసుకోవాలి. తరువాత రూ.5వేల నుంచి రూ.3లక్షల విలువ చేసే టోకెన్లు తీసుకోవాలి. ఆట గెలిచిన వ్యక్తులు చివరిలో సెక్యూరిటీకి ఆ టోకెన్ ఇస్తే అందుకు తగ్గ నగదును వారికి అందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరి వద్దనైనా డబ్బులు లేకపోతే వారితో ప్రామిసరీ నోట్లపై సంతకాలు పెట్టించుకుని నిర్వాహకులే అధిక వడ్డీకి డబ్బులు ఇస్తున్నట్లు సమాచారం. ప్రతిరోజూ 30 నుంచి 50 మంది వరకు పేకాట శిబిరాలకు వస్తున్నట్లు తెలుస్తోంది. వీరికి మధ్యాహ్న భోజనం, సాయంత్రం టీ, బిస్కెట్ కూడా నిర్వాహకులు అందిస్తున్నారు. ఆంధ్రా పోలీసులకు అనుమానం రాకుండా పేకాటరాయుళ్లు రోజుకొక వాహనంపై వస్తున్నట్లు తెలుస్తోంది.

21న హుండీల లెక్కింపు

గార, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్రీకూర్మ క్షేత్రంలో ఈనెల 21న మంగళవారం ఉదయం 9 గంటలకు స్వామివారి హుండీలను తెరచి లెక్కించనున్నట్టు ఆలయ ఈవో జి.గురునాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు, గ్రామపెద్దలు, అధికారుల సమక్షంలో హుండీలను లెక్కిస్తామన్నారు.

అభిప్రాయ సేకరణ వాయిదా వేయండి

ఆమదాలవలస, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జీవో 117 రద్దు తర్వాత చేపట్టాల్సిన సవరణల మెమోపై క్లస్టర్, మండల, జిల్లా స్థాయిల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో అభిప్రాయ సేకరణ సమావేశాలు వాయిదా వేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి సెలవుల ముందురోజు 9న మెమో విడుదల చేసి సంక్రాంతి సెలవులు లోపలే అభిప్రాయసేకరణ చేపట్టాల్సిన తొందర ఎందుకని ప్రశ్నించారు. పండగ సెలవుల్లో ఎవరూ అందుబాటులో ఉండరని, ఇలాంటి సమయంలో అభిప్రాయ సేకరణ చేపడితే అది మొక్కుబడిగా నిర్వహించినట్టే అవుతుందన్నారు. ఉపాధ్యాయ సంఘాల సూచనలు పరిగణనలోనికి తీసుకోవాలని కోరారు.

ముగిసిన సంగమేశ్వర జాతర

ఆమదాలవలస, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని గాజుల కొల్లివలసలో నిర్వహించిన సంగమేశ్వర జాతర గురువారం ముగిసింది. జైన, బౌద్ధ, శైవ మత ఆనవాళ్లతో కూడిన కొండపై సంగమేశ్వరస్వామిని సంక్రాంతి సందర్భంగా ప్రత్యేకంగా పూజించడం ఈ జాతర ప్రత్యేకత. ప్రతి ఏడాది సంక్రాంతి, కనుమ, ముక్కనుమ మూడు రోజులు ఎంతో వైభవంగా నిర్వహించిన జాతరకు జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన భక్తులు వేలాదిగా వచ్చారు. కొల్లివలస సర్పంచ్ ఎం.కూర్మారావు, టీడీపీ నాయకులు సవిరి చిన్నారావు, పొలం శ్రీను ఆధ్వర్యంలో యువత కమిటీగా ఏర్పడిఆతరను విజయవంతం చేశారు. భక్తులు, వ్యాపారులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ బాలరాజు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విభిన్నప్రతిభావంతులకు గ్రీవెన్స్ నేడు

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతీనెల మూడో శుక్రవారం విభిన్న ప్రతిభావంతులకు నిర్వహిస్తున్న స్వాభిమాన్ వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని 17న శుక్రవారం నిర్వహించనున్నామని ఆ శాఖ ఏడీ కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతుల నుంచి వినతులు స్వీకరించనున్నామన్నారు. కార్యక్రమాన్ని జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

కుమార్‌రాజుకు పురస్కారం

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ కార్యదర్శి, శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు, కవి, రచయిత బుర్రి కుమార్‌రాజు తెలుగు కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. పురస్కారానికి ఎంపిక చేసినందుకు శ్రీశ్రీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షుడు ఈశ్వరీ భూషణం, పార్థసారధిలకు ఓ ప్రకటనలో కుమార్‌రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 21న విజయవాడలోని కౌతా పూర్ణానంద విలాస్ కళావేదికపై పురస్కారం అందుకోనున్నారు.

క్లస్టర్ విధానాలపై సమీక్ష



ఎంఈవోతో మాట్లాడుతున్న డీఈవో

ఇచ్ఛాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో నూతనంగా ప్రవేశ పెడుతున్న క్లస్టర్ విధానాలపై డీఈవో తిరుమల చైతన్య.. ఎంఈవో అప్పారావుతో సమీక్ష నిర్వహించారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో గురువారం ఎంఈవో, సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో కామేశ్, రవి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రీమియర్ లీగ్ క్రికెట్ ఫైనల్ నేడే

ఇచ్ఛాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సురంగిరాజా క్రికెట్ మైదానంలో ఐదురోజులుగా జరుగుతున్న నరసింగరావు, భానుమతి స్మారక ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్ శుక్రవారం జరుగనుందని నిర్వాహకులు తెలిపారు. బ్లూ డైమాండ్స్ కిడ్స్ స్టార్స్ మధ్య పోటీ జరుగుతుందని తెలిపారు.

11 నెలలుగా జీతాల్లేవ్!

- దినసరి ఉద్యోగులకు ఆర్థిక కష్టాలు
- అప్పు చేసి కాలం వెళ్లదీస్తున్న వైనం
- పట్టించుకోని యంత్రాంగం
- ఇదీ.. ఆదిత్యాలయ ఉద్యోగుల దుస్థితి



అరసవల్లిలోని సూర్యనారాయణస్వామి ఆలయం

అరసవల్లి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ దేవస్థానంలో గత ఐదేళ్లుగా వారంతా దినసరి వేతనంపై పని చేస్తున్న ఉద్యోగులు. ఆలయానికి సంబంధించిన అన్ని విభాగాల్లోను సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారు. గత ఐదేళ్లలో ఆలయ ఆదాయం పెరిగి, ఇంతింతై వటుడింతైనట్టు నేడు డీసీ స్థాయికి చేరుకుంది.. అంటే అందులో దినసరి ఉద్యోగుల సేవలు ముఖ్య భూమిక పోషించాయన్నది కాదనలేని నిజం. పర్మినెంట్ ఉద్యోగులు వారికి నచ్చిన సమయానికి విధుల్లోకి హాజరైనా.. దినసరి వేతనదారులు మాత్రం ఉదయం 6.00 గంటల నుంచే విధుల్లోకి వచ్చి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా, ఆలయం మూసేంతవరకు, అన్ని విభాగాల్లో నిరంతరం సేవలందిస్తుంటారు. అందువల్లనే నేటికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయంలో పనులు సజావుగా జరిగిపోతున్నాయి. అటువంటి వారికి గత రథసప్తమి నుంచి నేటి వరకు అంటే 11 నెలలుగా జీతాలు నిలిచిపోయాయి. కారణాలేమైనా, అతి తక్కువ వేతనంతో ఆలయానికి సంబంధించిన అన్ని విభాగాల్లోను కీలక సేవలందించే వారికి జీతాలు ఆగిపోవడం, అధికారులు దీనిపై దాటవేత ధోరణితో వ్యవహరించడం జరుగుతోంది. తరచుగా అధికారులు మారుతుండడం, కొత్తగా వచ్చిన వారు మాకెందుకులే అని కంటి తుడుపు చర్యలతో సరిపెట్టుకోవడంతో ఉద్యోగులు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు.

48 మంది సేవలు

అన్నదానం, ప్రసాదాల పంపిణీ వద్ద 15 మంది, టిక్కెట్లు, పూజా కౌంటర్లు, ప్రొటోకాల్ దర్శనాలకు సంబంధించి 10 మంది, కేశ ఖండన శాల వద్ద, కార్యాలయ పనులపై ఆరుగురు, అర్చకులు ఐదుగురు, గోశాల, శానిటేషన్ తదితర పనుల్లో 12 మంది.. ఇలా మొత్తంగా 48 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా పేద కుటుంబాలకు చెందినవారే. ఇన్నాళ్లుగా జీతాలు లేకపోయినా, వస్తాయనే ఆశతో ఎదురుచూస్తున్నారు. ఆలయానికి సంబంధించిన దాదాపు అన్ని విభాగాలు వీరి సేవలతోనే నడుస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు. వీరికి ఎవరి విభాగాలపై వారికి పూర్తి అవగాహన ఉంది. అటువంటి వారి సేవలు దూరమైతే రానున్న రథసప్తమి వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడంలో ఇబ్బందులు ఎదరవుతాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇప్పటికైనా ఈ సమస్యపై అధికారులు, నాయకులు స్పందించి వారికి తక్షణమే జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇంకా ఎంతో కాలం జీతాలు లేకుండా సేవలు చేయలేమని వారంతా వాపోతున్నారు.

కోటి సభ్యత్వాలు హర్షణీయం

- ఎంపీ కలిశెట్టి



కేక్ కట్ చేస్తున్న ఎంపీ కలిశెట్టి

రణస్థలం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కోటి సభ్యత్వాలను స్వీకరించడం హర్షణీయమని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం కలిశెట్టి మాట్లాడుతూ పార్టీపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమే కోటి సభ్యత్వాలు అన్నారు. టీడీపీ బలోపేతం కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు పిన్నింటి భానూజీనాయుడు, నాయకులు గొర్లె లక్ష్మణరావు, ముక్కు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జోడెద్దుల బండి జాతర



జోడెద్దుల బండి జాతరలో జనం

సరుబుజ్జిలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురుషోత్తపురంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించే జోడెద్దుల బండి జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉమాకామేశ్వరస్వామి జాతరను ఏటా ముక్కనుమ రోజున నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా గురువారం తొలుత ఆలయంలో ఉమాకామేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం జోడెద్దుల బండిపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం వంశధార నదిలో తీర్థస్నానాలు చేయించారు.

నేడు మదుపాంలో యాత్ర

జి.సిగడాం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలం మదుపాంలో శుక్రవారం దుర్గాదేవి యాత్ర మహోత్సవాలను ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇక్కడ కొలువైన అమ్మవారిని దర్శించుకునేందుకు జి.సిగడాం, పొందూరు మండలాల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉందన్నారు. మూడురోజుల పాటు నిర్వహించనున్న యాత్రలో పలు వినోద, సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశామన్నారు. యాత్ర ముగింపు రోజున భారీ ఎత్తున అన్న సమారాధన చేయనున్నామని తెలిపారు.

పైడితల్లి దర్శనానికి పోటెత్తిన భక్తులు

జి.సిగడాం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలం గెడ్డకంచరాంలో పైడితల్లి యాత్ర సందర్భంగా రెండోరోజు గురువారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

గోమాతకు సీమంతం

జి.సిగడాం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలం వెలగాడలో గురువారం రామారావు, సత్యవతి దంపతులు గోమాతకు సీమంతం చేశారు. గోమాతను పూజిస్తే అష్టైశ్వర్యాలు, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందనేది వారి నమ్మకం. ఆడపడుచుకు సీమంతం చేసే మాదిరిగానే చీర, సారెతో సాగనంపారు. కార్యక్రమంలో పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.



గోవుకు సీమంతం చేస్తున్న దృశ్యం

రైల్వే డీఆర్‌ఎంకు వినతిపత్రం



వినతిపత్రం అందజేస్తున్న సూర్యప్రకాశ్

ఇచ్ఛాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం, సోంపేట, జాడుపూడి, బారువ రైల్వే స్టేషన్లలో సమస్యలు పరిష్కరించాలని రైల్వే డీఆర్‌ఎం హెచ్ఎస్ భద్వాను డీఆర్‌యూసీసీ సభ్యుడు కట్టా సూర్యప్రకాశ్ కోరారు. గురువారం ఖుర్దారోడ్‌లో డీఆర్‌ఎంను కవి నతిపత్రం అందజేశారు. అమృత భారత్ స్టేషన్ అభివృద్ధిలో భాగంగా ఇచ్ఛాపురంలో నిర్మిస్తున్న కొత్త కాలినడక వంతెనను పొడిగించాలని కోరారు. విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను లింగంపల్లి వరకు, భువనేశ్వర్ పలాస ఎంఈఎంయూ శ్రీకాకుళం రోడ్డు వరకు పొడిగించాలని విన్నవించారు. బరంపురం-విశాఖ పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను జాడుపూడి, కొర్లాం స్టేషన్‌లలో నిలుపదల చేయాలని అభ్యర్థించారు. ఇందుకు డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించారని, ఇచ్ఛాపురం అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారని ఆయన తెలిపారు.

గుండెపోటుతో వీజీకే మూర్తి మృతి

- నేడు రిమ్స్‌కు భౌతికకాయం అప్పగింత



వీజీకే మూర్తి (ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని కత్తెర వీధిలోని నివాసంలో ఉంటున్న సీఐటీయూ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు వీజీకే మూర్తి(73) గుండెపోటుకు గురయ్యారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఆయన మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగమణి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీజీకే మూర్తి మృతి చెందడం కార్మిక, ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. జిల్లాలో సీఐటీయూ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. నగరంలో కత్తెర వీధిలోని ఆయన నివాసంలో శుక్రవారం ఉదయం సంతాప సభ నిర్వహించిన అనంతరం రిమ్స్ వరకూ ప్రదర్శన నిర్వహించి ఆయన భౌతిక కాయాన్ని అప్పగించనున్నామన్నారు.

మూర్తికి సంతాపం

గుజరాతీపేట: సీఐటీయూ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు వీజీకే మూర్తి మృతిపట్ల జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా అధ్యక్షుడు కె.కామేశ్వరరావు, సభ్యులు సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ఐ.జగన్మోహనరావు, సీహెచ్ రామచంద్రరావు, ఆర్.సురేష్‌బాబు, గోవిందరావు తదితరులు ఉన్నారు.

మూర్తి నేత్రాలు సజీవం

అరసవల్లి: నగరంలోని కత్తెర వీధిలో నివాసం ఉంటున్న సీఐటీయూ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు వీజీకే మూర్తి (73) మృతి చెందడంతో ఆయన నేత్రాలను కుమార్తె స్రవంతి, కుమారుడు శ్రీనివాస్ దానం చేశారు. నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ పి.సుజాత, సహాయకురాలు పి.సుమతి అతడి కార్నియాలు సేకరించారు. తాను మరణించినా మరో ఇద్దరికి జీవితాల్లో వెలుగులు నింపిన ఆయనకు రెడ్‌క్రాస్ ఛైర్మన్ జగన్మోహనరావు, కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు నివాళులర్పించారు.

విజేతలకు బహుమతులు



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

బూర్జ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరగాంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సీతారామ యువజ సంఘం క్రీడలు, ముగ్గుల పోటీలను నిర్వహించింది. బుధవారం రాత్రి విజేతలకు బహుమతుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు మజ్జి అలప్పలనాయుడు, ఉరిటి రఘు, సీహెచ్ ప్రసాద్, మజ్జి రమేష్, జి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి



వినతిపత్రాన్ని అందజేస్తున్న కాళింగ కులస్థులు

కవిటి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కవిటిలోని శ్రీకృష్ణ భార్గవ కాళింగ సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అశోక్‌ను కాళింగ సంక్షేమ సంఘ సభ్యులు కోరారు. రామయ్యపుట్టుగలోని నివాసంలో గురువారం ఎమ్మెల్యేను సంఘ పెద్దలు వినతిపత్రాన్ని అందజేశారు. అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేసేందుకు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో బి.చిట్టిబాబు, బి.రమేష్, పి.లక్ష్మణరావు, బి.సర్వేశ్వరరావు, ఎ.మధు, టి.జైరామ్, ఎ.కృష్ణారావు, ఎ.రాజు తదితరులున్నారు.

గోపూజలో ఎమ్మెల్యే దంపతులు

రణస్థలం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆనందంగా ఉండాలని, పాడి పంటలతో విలసిల్లాలని కోరుతూ గురు వారం గోవులకు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, రజిని దంపతులు పూజలు చేశారు. పాడి అభివృద్ధి చెందితే రైతులకు అన్ని విధాలుగా లాభం చేకూరుతుందన్నారు. ప్రతి ఒక్కరూ గో సేవ చేయాలని సూచించారు.

దేహదారుఢ్య పరీక్షల్లో 317 మంది అర్హత



పరుగు పరీక్షలో అభ్యర్థులు

ఎచ్చెర్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల సాయుధ పోలీసు మైదానంలో కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియలో భాగంగా గురువారం నిర్వహించిన దేహ దారుఢ్య పరీక్షల్లో 317 మంది అర్హత సాధించారు. 727 మంది హాజరు కావల్సిఉండగా, 478 మంది హాజరయ్యారు. ఇందులో 317 మంది అర్హత సాధించారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి పర్యవేక్షణలో ఎంపిక ప్రక్రియ కొనసాగింది.

ప్రమాద రహిత ప్రయాణమే లక్ష్యం



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ దేవదానం

అరసవల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రమాద రహిత ప్రయాణమే లక్ష్యంగా గురువారం నుంచి ఫిబ్రవరి 15 వరకూ రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహించనున్నామని ట్రాఫిక్ ఎస్ఐ దేవదానం అన్నారు. గురువారం శ్రీకాకుళం 1వ డిపో గ్యారేజ్ ఆవరణలో రహదారి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూచికలు, గమనాలను డ్రైవర్లు పరిశీలిస్తూ భద్రతతో కూడిన ప్రయాణాన్ని ప్రజలకు అందించాలన్నారు. ప్రమాదరహిత, సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా పనిచేసి, ప్రయాణికుల మన్ననలను పొందాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డిపో మేనేజర్ కేఆర్ఎస్.శర్మ, సహాయ మేనేజర్ రమేష్, గంగరాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఎస్.నాయుడు, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్లు భాస్కరరావు, మూర్తి, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మెట్టవలసలో ముగిసిన యాత్ర

జి.సిగడాం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలం మెట్టవలసలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న మల్లికార్జునస్వామి యాత్ర మహోత్సవాలు గురువారం ముగిశాయి. జి.సిగడాం, పొందూరు, సంతకవిటి, రాజాం మండ లాల నుంచి వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

సందడిగా అ'పూర్వ' సమ్మేళనాలు



కంచిలి: పెద్దశ్రీరాంపురంలో పాఠశాలలో..



సోంపేట: బారువ డిగ్రీ కళాశాలలో..

కంచిలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దశ్రీరాంపురం జడ్పీ ఉన్నత పాఠశాల 2005-06 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని గురువారం పాఠశాలలో నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పరిచయం చేసుకుని, గత రోజులను గుర్తుచేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను సత్కరించారు. ఆటపాటల తో సందడి చేశారు. కార్యక్రమంలో అప్పటి హెచ్ఎం నాగేశ్వరరావు, ఎంఈవో శివరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- సోంపేట: బారువ డిగ్రీ కళాశాలకు చెందిన 2004-2007 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని గురువారం కళాశాలలో సందడిగా నిర్వహించారు. 19 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని, అలనాటి ముచ్చట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో కాశీప్రసాద్, కూర్మారావు, నాని, భువన, తేజేశ్వరరావు, రమేష్ ఉన్నారు.

మత్స్యకారుడి కుటుంబాన్ని ఆదుకుంటాం: మంత్రి అచ్చెన్న

అరసవల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గార మండలం బందరువానిపేట వద్ద పడవ బోల్తా పడి మత్స్యకారుడు కుంది గడ్డెయ్య మృతి చెందడంపై రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

క్రైం కార్నర్

పడవ బోల్తా.. మత్స్యకారుడి మృతి


గడ్డెయ్య(ఫైల్)

గార, జనవరి 16(ఆంధ్రజ్యోతి): బందరువానిపేట వద్ద గురువారం మధ్యాహ్నం సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు కుంద గడ్డెయ్య(41) పడవ బోల్తా పడి మరణించాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డెయ్య, మరో నలుగురితో కలిసి బోటుపై సముద్రంలో చేపల వేటకు వెళ్లాడు. సముద్రంలో కొంతదూరం వెళ్లేసరికి అలల తాకిడికి బోటు బోల్తా పడింది. బోటులో ఉన్న గడ్డెయ్య సముద్రంలో పడి చనిపోయాడు. కాగా గడ్డెయ్యకు భార్య తోటమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. చేపల వేటే జీవనాధారంగా బతుకుతున్న గడ్డెయ్య కుటుంబం దిక్కులేనిదైంది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు. భార్య తోటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ ఎం.చిరంజీవిరావు కేసు నమోదు చేశారు.

విశాఖలో సోంపేట వాసి..


రాజ్‌కుమార్ మృతదేహం

సోంపేట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): బుషాభద్ర గ్రామానికి చెందిన మండపాటి రాజుకుమార్ (50) విశాఖపట్నంలో మృతి చెందినట్టు సీఐ మంగరాజు తెలిపారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో మృతి చెందినట్టు అక్కడి పోలీసులు సమాచారం అందించారన్నారు. కుటుంబ సభ్యులకు ఆ సమాచారాన్ని చేరవేశామని, వివరాలు తెలియాల్సి ఉందన్నారు. భార్య రాజ్యలక్ష్మి విశాఖలో ఉండడంతో అక్కడకు వెళ్తున్న క్రమంలో ఆయన మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి..

పాతపట్నం జనవరి 16(ఆంధ్రజ్యోతి): చిన్నలోగిడి గ్రామ సమీపంలో రైలు కిందపడి ఒక వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకొంది. పూరి నుంచి గుణుపూర్ వెళ్లే రైలు కింద గురువారం రాత్రి సుమారు7.45 గంటల సమయంలో గుర్తు తెలియనవ్యక్తి పడి మృతి చెందాడు. మృతుని వివరాలు ఇంకా తెలియాల్సిఉంది.

యువకుడి ఆత్మహత్య

గార, జనవరి 16(ఆంధ్రజ్యోతి): జొన్నలపాడు దగ్గరలోని రైసు మిల్లులో సహాయ డ్రైవర్‌గా పనిచేస్తున్న యువకుడు వికాస్‌కుమార్ (20) గురువారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బిహార్‌కు చెందిన వికాస్‌కుమార్ వ్యకిగత కారణాలతో మిల్లు వెనుక ప్రహరీ దగ్గర ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ఏఎస్‌ఐ చిరంజీవిరావు తెలిపారు. వికాస్‌కుమార్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సారాతో వ్యక్తి అరెస్టు

పలాస రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): నవరరామకృష్ణాపురం గ్రామానికి చెందిన నవర సోమేశ్వరరావును గురువారం నాలుగు లీటర్ల సారాతో పట్టుకొని అరెస్టు చేసినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునరావు తెలిపారు. పక్కా సమాచారం మేరకు గ్రామంలోకి వెళ్లి దాడులు చేయగా సారాతో అతను పట్టుబడ్డారని తెలిపారు. అక్రమంగా సారా అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ మల్లికార్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందంతో పాటు సిబ్బంది పాల్గొన్నట్టు ఆయన తెలిపారు.

నిధులు జమ కావడంపై హర్షం

పలాసరూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): గత టీడీపీ పాలనలో 2014-19 వరకూ జరిగిన పాలనలో నగరదర్శిని, గ్రామదర్శిని, జన్మభూమి బృందాల్లో పని చేసిన కళాకారులందరికీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. దీంతో వారంతా తమ అకౌంట్లలో జమ కావడంపై కళాకారులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన నిధులు గత ప్రభుత్వం అందించకుండా ఉండిపోవడం, ప్రస్తుత ప్రభుత్వం వాటిని సంక్రాంతి సమయంలో వేయడంతో వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా నాటి నగరదర్శిని, గ్రామదర్శిని, జన్మభూమి టీమ్‌ల్లో పని చేసిన కళాకారులకు నిధులు విడుదల చేయడంపై ఏపీ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో హర్షం తెలిపారు.

ముమ్మరంగా రబీ సాగు


నరేంద్రపురంలో ఉబాలు చేస్తున్న దృశ్యం

నందిగాం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): వంశధార పరివాహక ప్రాంత పరిధి గ్రామాల్లో రబీ ఉబాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇటీవల అల్పపీడన ప్రభావంతో రెండు పర్యాయాలు పడిన వర్షపు జల్లులతో రైతుల్లో రెండో పంట సాగు చేయాలన్న ఆసక్తి వచ్చింది. దీంతో నర్సిపురం, దేవళభద్ర, పెంటూరు, శివరాంపురం, గొల్లూరు, నరేంద్రపురం తదితర గ్రా మాల పరిధిలో ఉబాలు చేస్తుండగా నందిగాం, జల్లపల్లి తదితర గ్రామాల్లో ప్రజలు సాగుచేస్తున్నారు. రబీ వరిసాగు పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు.

గోదాముగా 'సచివాలయం'

- బిల్లులు చెల్లించలేదంటూ అప్పగించని కాంట్రాక్టర్
- సొంత అవసరాలకు వాడుకుంటున్న వైనం
- ఎమ్మెల్యే ఆదేశించినా.. పట్టించుకోని అధికారులు

పొందూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కనిమెట్ట గ్రామంలో నిర్మించిన నూతన సచివాలయం ప్రాంభించినా వినియోగంలోకి రాకుండాపోయింది. దీంతో నూతన భవనం అందుబాటులో ఉన్నా ఓ ప్రైవేట్ ఆసుపత్రిలోనే సచివాలయాన్ని కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. కనిమెట్ట సచివాలయాన్ని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టారు. పక్కా భవనం ఉన్నా సచివాలయాన్ని మార్చకపోవడంపై ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్లే కాంట్రాక్టర్ (సర్పంచ్ భర్త) ఆధీనంలో సచివాలయం ఉండిపోయిందని విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి సచివాలయాన్ని చెరవు గర్భంలో నిర్మించడంతో అప్పట్లో వివాదమైంది. వైసీపీ ప్రజాప్రతినిధుల ఒత్తిడితో అధికారులు ఆ చెరువు గర్భంలోనే నిర్మించేందుకు అనుమతులు ఇచ్చారు. దీంతో 2020లో పనులు ప్రారంభించిన ఈ భవన నిర్మాణ పనులు 2023లో పూర్తయింది. దీంతో అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాం ఈ భవనాన్ని ప్రారంభించారు. అయితే ఆ తర్వాత అధికారులు బిల్లులు చెల్లించలేదంటూ కాంట్రాక్టర్ గంగాధరరావు సచివాలయం తాళాలు ఇవ్వకుండా తన ఆధీనంలో ఉంచుకున్నారు. ఇప్పుడు ఈ భవనంలో కాంట్రాక్టర్ ధాన్యం బస్తాలు వేసి గోదాంగా వినియోగించుకుంటున్నారు. దీంతో గ్రామానికి చెందిన కొంతమంది నాయకులు ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే తక్షణమే ఆ సచివాలయ భవనాన్ని స్వాధీనం చేసుకుని విధులు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ డీఈ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. చూస్తాం.. చెస్తామంటూ సరైన సమాధానం చెప్పకుండా దాటవేస్తుండడం విశేషం.



గోదాముగా మార్చేన నూతన సచివాలయ భవనం

దుస్తులు పంపిణీ

నందిగాం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందిగాం పంచాయతీ గ్రీన్‌అంబాసిడర్లకు సర్పంచ్ జడ్యాడ రమణమ్మ దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక సచివాలయం ఆవరణలో నందిగాం, పెంటూరు పరిధిలో చెత్తసేకరణ చేస్తున్న అంబాసిడర్లకు, సూపర్‌వైజర్‌కు అందించారు. కార్యక్రమంలో జె.జయరాం తదితరులు ఉన్నారు.

బొమ్మల కొలువు

టెక్కలి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కొండ్రవీధిలో గురువారం మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. గీతామందిర వ్యవస్థాపకులు జామి వెంకటేశ్వరరావు, మాధవీలత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అలాగే సంక్రాంతి సందర్భంగా ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పట్టణ ప్రముఖులు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యువత పాత్ర కీలకం: మంత్రి అచ్చెన్న


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పురోభివృద్ధికి యువత పాత్ర అత్యంత కీలకమైనదని, సంపద సృష్టించడంలో యువకుల కృషి అవసరమని, రాబోవు తరాలకు యువత మార్గదర్శకులుగా నిలబడాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర మహాసభల ఆహ్వాన పత్రికను నిమ్మడలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. శ్రీకాకుంలో ఫిబ్రవరి 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘ అధ్యక్షులు చాపర సుందరలాల్, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పితే అంతే..


పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో

ఎల్ఎన్ పేట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఈ ఫొటో ఉన్న ఆటో ప్రయాణికులతో ఎంత ప్రమాదకరంగా వెళ్తుందో చూడండి. ఏ మాత్రం అదుపు తప్పినా భారీ మూల్యం తప్పదు. పరిమితికిమించి వాహనాల్లో ఎక్కించుకుంటూ నిబంధనలు పట్టించుకోవడంలేదు. ఆటోల్లో పరిమితికి మించి ఒకరిపై ఒకరు కూర్చొని ప్రమాదకరంగా వెళ్తున్నారు. దాదాపు 20మంది నుంచి 25మంది వరకు ఆటోల్లో ప్రయాణం చేస్తున్నారు. ఈ ఆటో ఏ మాత్రం బేలన్సు తప్పినా, ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించుకొనే సమయంలోనైనా ప్రమాదం జరిగినా ఆ నష్టాన్ని ఊహించలేం. పరిమితికి మించి వాహనాలతో వెళ్లే వాహనాలను ట్రాఫిక్ నియంత్రణ అధికారులు, పోలీసు సిబ్బంది రోడ్లపై పర్యవేక్షణ చేసి పరిమితికిమించి వాహనాల్లో తీసుకెళ్తున్న వాహనచోదకులపై శాఖాపరంగా తగిన చర్యలు చేపట్టి ప్రమాదాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

సంప్రదాయాలను ఆచరించాలి

టెక్కలి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మన ఆచారాలు, సంప్రదాయాలు భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని రిటైర్డు ఇంజనీరింగ్ అధికారి పి.సింహాచలం అన్నారు. గురువారం పట్టుశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక అక్కపువీధిలో భావనా మహర్షి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మహర్షి చిత్రపటానికి సంఘ అధ్యక్షులు మల్లిపెద్ది మధుసూధనరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పమ్మిన సింహాచలం, లోకేష్ సౌజన్యంతో పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దుంప శ్రీనివాస్, పార్వతీశం, శ్యామసుందరరావు, నందికేశ్వరరావు, విశ్వేశ్వరరావు, రఘునాథరావు, సాంబమూర్తి, మురళీమోహన్‌లు ఉన్నారు.

అవగాహన తప్పనిసరి

టెక్కలి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఇందిరాగాంధీ కూడలిలో హెల్మెట్ ధరించని పలువురు ద్విచక్రవాహనదారులతో ఆయన మాట్లాడారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

రూ. 25వేలు అందజేత

కోటబొమ్మాళి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆర్థిక సహాయంలో స్థానిక ఎన్టీఆర్ భవన్ ఆవరణలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌కు కురుడు పంచాయతీ చౌదరి కొత్తూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నాళ్ల అదినారాయణ (చిన్ని) గురువారం రూ.25వేలు వితరణగా అందజేశారు. ఈ మొత్తాన్ని అన్న క్యాంటీన్ నిర్వహకులు లాడి శ్రీనివాస్‌కు అందజేసినట్టు తెలిపారు.

కొత్తమ్మతల్లికి ఆభరణాలు వితరణ

కోటబొమ్మాళి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తమ్మతల్లికి విశాఖకు చెందిన కుమారి పిన్నింటి లిఖిత 12.420 గ్రాముల బంగారు ఆభరణాలను గురువారం ఆలయ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణకు అందజేశారు. రెండు శతమానాలు, ఒక బొట్టు, ఒక నత్తు ఉన్నాయని ఈవో తెలిపారు. అలాగే కొత్తమ్మతల్లి ఆలయంలో జరుగుతున్న నిత్య అన్నదానానికి ఆయన కోరారు.

నేటి ఎస్పీ గ్రీవెన్స్ రద్దు

పలాస, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించాల్సిన ప్రజాఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం(మీకోసం) కార్యక్రమం రద్దు చేస్తున్నట్టు ఎస్పీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కానిస్టేబుల్స్ ఎంపిక ప్రక్రియ జరుగుతున్న దృష్ట్యా నిర్వహించలేకపోతున్నట్టు తెలిపారు. కాశీబుగ్గ సబ్‌డివిజన్‌లో ఉన్న ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు.

శతశాతం పూర్తిచేయాలి

ఎల్ఎన్ పేట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మిస్సింగ్ సిటిజన్ సర్వే వివరాలను శతశాతం పూర్తిచేయాలని తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ తెలిపారు. తురకపేట గ్రామంలోని సచివాలయాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది ఇంతవరకు గ్రామాల్లో చేసిన మిస్సింగ్ సిటిజన్ రిపోర్టర్లను సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఉన్నా, దూర ప్రాంతాల్లో ఉన్నా వారి భూములు, రేషన్ కార్డులతోపాటు ఆధార్ కార్డులకు వారి ఫోన్ నెంబర్లను అనుసంధానం తప్పనిసరిగా చేయించాలన్నారు. జి.తవిటినాయుడు, మాధురి, రెవెన్యూ కార్యదర్శి జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల విజేత టెక్కలి


ట్రోఫీ అందుకుంటున్న టెక్కలి వాలీబాల్ జట్టు

హరిపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మందస మండలం మద్యూరు గ్రామంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో టెక్కలి జట్టు విజయం సాధించింది. స్థానిక పాలపోలమ్మ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 22జట్లు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో టెక్కలి, చాపరాయి, మందస జట్లు నిలిచాయి. విజేతకు రూ.10 వేలు, రూ.6వేలు, రూ.4వేలు చొప్పున్న నగదుతోపాటు షీల్డ్ గురువారం అందజేశారు. సర్పంచ్ ఉమామహేశ్వరావు, గ్రామస్థులు గేదెల రామకృష్ణ, పొట్టి కోదండరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇలా ప్రారంభించి.. అలా వదిలేశారు!


గంగువాడ వద్ద టెక్కలి బీటీ రోడ్డు దుస్థితి

పాతపట్నం జనవరి 16(ఆంధ్రజ్యోతి): పాతపట్నం-తెంబూరు రోడ్‌లో మరమ్మతు పనులు గత నెలలో ప్రారంభించారు. సీతారాంపల్లి కూడలి నుంచి ఎనిమిది కిలోమీటర్ల మేరక మరమ్మతు పనులకు రూ.4.80 లక్షల నిధులు మంజూరైనట్టు ఆర్‌అండ్‌బీ జేఈ యోగి తెలిపారు. ఈ పనులను ఇలా ప్రారంభించి.. అలా వదిలేశారు. దీంతో ఈ మార్గంలో ఉండే గ్రామస్థులు నిరాసకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పనులుప్రారంభమైనాయి. అయితే ఇలా అంసపూర్తిగా నిలిపివేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా పనులుప్రారంభించి గోతులు పూడ్చాలని ఆయాగ్రామవాసులు కోరుతున్నారు.

శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకున్న భక్తులు


స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

జలుమూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగంలో గల శ్రీముఖలింగేశ్వరస్వామిని ముక్కనుమ పర్వదినం పురస్కరించుకొని గురువారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సంక్రాంతికి స్వగ్రామాలు వచ్చే వలస పక్షులు తిరుగు ప్రయాణంలో శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకున్నారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి దర్శనార్థం శ్రీముఖలింగం చేరుకొని బారులుతీరారు.

ఆలయ నిర్మాణానికి సాయం


ఆలయ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందిస్తున్న ఆర్మీ ఉద్యోగులు

హిరమండలం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): దేశ సేవలోనే కాదు గ్రామం అభివృద్ధికి కూడా తమ వంతు సహాయం అందించేందుకు ఆర్మీ ఉద్యోగుల ముందుకు వచ్చారు. మరికొంత మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. మండలంలోని ధనుపురం గ్రామంలో చెవిటమ్మతల్లి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగులందరూ కలిసి రూ.1.50 లక్షలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. ఆర్మీ ఉద్యోగలను సర్పంచ్ దారపు డిల్లేశ్వరరావుతోపాటు, గ్రామ పెద్దలు అభినందించారు.

ప్రమాదకరంగా మలుపులు



పలాస రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): లొద్దభద్ర గ్రామం నుంచి నవర గోవిందపురం గ్రామానికి వెళ్లే రహదారిలో మలుపులు ఎక్కువగా ఉన్నాయి. రహదారి అంతా వంకలుగా ఉండడం, ఆ చోట్ల హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడంతో తరచూ వాహనచో దకకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా చెరువు ప్రాంతం వద్ద అధికంగా మలుపులు ఉండడం, రక్షణ గోడ లేక చిన్నపాటి స్తంభా లు ఏర్పాటు చేసి ఉండడంతో రాత్రివేళల్లో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నట్టు గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సరైన హెచ్చరిక బోర్డులు, రక్షణ గోడ నిర్మించాలని కోరుతున్నారు.

సరిహద్దులో పేకాట.. అంతా టోకెన్లతోనే..

(ఐదో పేజీ తరువాయి)

అందించేవారనే ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది వైసీపీ నాయకుల ద్వారా పోలీసులను మేనేజ్ చేయించేవారనే విమర్శలు ఉన్నాయి. దీంతో సరిహద్దులో జోరుగా పేకాట శిబిరాలు కొనసాగుతున్నా పోలీసులు పట్టించుకొనేవారు కాదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గంజాయి, పేకాట శిబిరాలపై ఉక్కుపాదం మోపుతున్న విషయం తెలిసిందే. అయినా గతంలో అలవాటు పడిన పేకాటరాయుళ్లు.. ఇంకా సరిహద్దుకు వెళ్లి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సంక్రాంతి పండుగ వేళ.. గ్రామాల్లో పేకాడేవారిపై పోలీసులు ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టారు.

నిఘా పెట్టాం..

సరిహద్దు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై నిఘా పెట్టాం. అవి ఒడిశా ప్రాంతాలు కావడంతో వెళ్లలేని పరిస్థితి. ఒడిశా పోలీసుల సహకారం తీసుకొని దాడులు చేస్తాం. గ్రామాల్లో పేకాట శిబిరాలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తాం.

- పిన్నింటి రమేష్‌బాబు, ఎస్ఐ, మెళియాపుట్టి

ఎండిన చెట్లు.. పొంచివున్న ప్రమాదం



టెక్కలి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): నౌపడా-మెళియాపుట్టి రోడ్డులో పలుచోట్ల ఎండిన చెట్లతో ప్రమాదం పొంచివుంది. ఏళ్ల తరబడి ఈ చెట్లు ఎండిపోయి ఉండడంతో ఎప్పుడు విరిగి రోడ్లు మీద పడతాయోననే భయం స్థానికులను వెంటాడుతుంది. ఈదురుగాలులు వచ్చినప్పుడల్లా ఈ చెట్లు కొమ్మలు విరిగిపోతుంటాయి. ఈ చెట్లు దరి విద్యుత్ తీగలు ఉండడంతో స్థానికులకు మరింత ఆందోళన కలిగిస్తుంది. డమర, నర్సింగపల్లి సమీపాల్లో ఇలా ఎండినచెట్లు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు ఏదైనా ప్రమాదం జరగకముందే ఈ చెట్లను తొలగించాలని రాంపురం, నర్సింగపల్లి సర్పంచ్‌లు పినకాన జోగారావు, రైతు జయమోహన్ కోరుతున్నారు.

ఎన్ఎం రోడ్డులో డమర సమీపాన ఎండిపోయిన చెట్టు

నర్సింగపల్లి సమీపంలో ఎండిపోయి కూలందుకు సిద్ధంగా ఉన్న చెట్టు



ఏడాదవుతున్నా అంతే..!

(ఐదో పేజీ తరువాయి)

సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. అయితే ఏడాది అవుతున్నా ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న మాదిరిగా పనులు ఉన్నాయి. అమృత్‌భారత్ నిధులతో స్టేషన్ ముందు భాగాన్ని ఆధునికీకరించాలి. ప్రయాణికులకు నీడనిచ్చేందుకు వీలుగా ప్లాట్‌ఫారంపై నిర్మాణాలు చేపట్టాలి. మరుగుదొడ్లు, ప్రయాణికుల వాహనాలు పార్కింగ్ చేసే విధంగా స్థలాల అభివృద్ధి, సాధారణ, ప్రత్యేక తరగతుల ప్రయాణికులు వేచి ఉండేందుకు వెయిటింగ్ గదులు వంటివి నిర్మించాల్సి ఉంది. కాగా ఒక్క నిర్మాణం కూడా పూర్తికాకపోవడంపై ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. స్టేషన్‌కు కూత వేటు దూరంలో రెండు అండర్ పాసేజ్‌లు నిర్మించాలి ఉంది. వాటికి సైతం అతీగతీ లేదు. పూరీ-అహ్మదాబాద్, హౌరా-యశ్వంత్‌పూర్ వంటి చాలా రైళ్లకు ఇక్కడ హాల్టింగ్ లేదు. దీంతో ప్రయాణికులు 50 కిలోమీటర్ల దూరంలోని పలాస రైల్వేస్టేషన్‌పై ఆధారపడుతున్నారు. లేదంటే 30 కిలోమీటర్ల దూరంలోని బరంపూర్(ఒడిశా) వెళ్లాల్సి వస్తోంది. పొరుగున ఉన్న బరంపూర్ స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. కానీ ఇక్కడి స్టేషన్ మాత్రం అలానే ఉండి పోతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా రైల్వేస్టేషన్ అభివృద్ధికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.


పలాసలో పార్కింగ్ స్థలం లేక.. రైల్వేస్టేషన్‌కు ఎదురుగా వాహనాలు నిలిపిన దృశ్యం